# ఎం. ఎఫ్. హుసేన్

## విజయ రాఘవరావ్

చక్కటి దృశ్యాన్ని చూడడం కళ్ళకు సార్థకత్వం; ఇంపైన సంగీతాన్ని వినడం చెవులకు సార్థకత్వం. అటు దృశ్యమూ, ఇటు సంగీతమూ, పూవూ తావిగా మేళవించి హృదయాన్ని తాకితే అదొక ఉదాత్తమైన అనుభవం.

అట్లాంటి అనుభవాన్ని ఇచ్చేదే- "త్రూ ది ఐస్ ఆఫ్ ఎ పెయింటర్" అన్న చలనచిత్రం. దీని నిర్మించిన వారు భారత ప్రభుత్వానికి చెందిన ఫిలింస్ డివిజన్‌వారు. ఫైళ్లు, మెమోలు కార్బన్ కాపీలు, ఆడిట్ రిపోర్టులు- ఎంతసేపు వీటినే గుర్తుకుతెచ్చే ప్రభుత్వం వారేమిటి? రసజ్ఞుల హృదయాలను కదిలించే చిత్రం తీయడం ఏమిటి అనిపించవచ్చును. కాని సహారా ఎడారిలోనే సంపంగిమొక్క పెరిగింది; ఓ పువ్వు పూచింది. ఆ పువ్వు పరిమళం ఖండాంతరాలకు వీచింది.

మరి ఈ చిత్ర విచిత్రం ఎట్లా సాధ్యమయింది? ఫిలింస్ డివిజన్‌వారు మామూలుగా వారానికి ఏ నాలుగు చొప్పునో తీసిపారేసే మంత్రుల రాకపోకలు, ప్రారంభోత్సవాలు, కుటుంబ నియంత్రణ, వరిపైరు సంరక్షణవంటి డాక్యుమెంటరీలు, ఫీచర్లు. అటుంచి కొంత డబ్బును చలనచిత్ర నిర్మాణంలో వినూత్న ప్రయోగాలకై కేటాయించారు.

అందులోంచి పుట్టినదే ప్రఖ్యాత చిత్రకారుడు ఎం. ఎఫ్. హుసేన్‌కు ఫిలింస్ డివిజన్ నుండి వెళ్లిన పిలుపు "ఇదిగో ఇది మా డబ్బు! మా

కెమేరామెన్, మా ముడిఫిలిమూ, మా సంగీత దర్శకుడు ఇదిగో వున్నారు. వారిని వినియోగించుకుని మీఇష్టంవచ్చినట్లు నిజంగానే మీ యిష్టం వచ్చినట్లు ఏ విషయం మీదయినా సరే ఒక చిన్న చలన చిత్రం తీసిపెట్టండి–'' అన్నారు ఫిలింస్ డివిజన్ వారు హుసేన్‌తో.

హుసేన్ ఎగిరి గంతేశారు. చిత్రకారులు చలన చిత్రకారులవడం మనకు మరీ అంత కొత్తేమీకాదు. సత్యజిత్‌రాయి మొదట చిత్రకారుడుగానే పేరుతెచ్చుకున్నారు. మనబాపు ఇన్నేళ్ళు చిత్రాలు రచించి ఇటీవల సాక్షి"తో చలన చిత్రంలోకి దిగారు. కొత్త అనేది ఏ కళా కారుడిలో నయినా సరికొత్త పిచ్చిని రేకెత్తిస్తుంది.

అందుకనే హుషారుగా చలనచిత్ర నిర్మాణానికి పూనుకున్నారు హుస్సేన్. తను ఎన్నోసార్లు బొమ్మలు గీయడానికి వెళ్ళిన రాజస్థాన్‌ను రంగంగా ఎన్నుకున్నారు. తనకు చిరపరిచితమయిన స్థలాలను, దృశ్యాలను చిత్రీకరించారు. తన హృదయానికి దగ్గరగావచ్చిన వాటినెల్లా ఛాయాచిత్రాలుగా తీయించారు. వాటిని చలన చిత్రంగా కూర్చారు ఆ పదిహేను నిమిషాల చలనచిత్రంలో ఒక్కగా నొక్క పదంకూడా కామెంటరీ లేదు.

అక్కడో రాజసమైన రాజస్తానీ పురుషుడి మొహం, ఇక్కడో పులి బొమ్మ ముందు తిరుగుతున్న మేక, అనంతాకాశంలోకి చూస్తూ శతాబ్దాల తరబడి నిలబడిన ఒక శిథిలం. అపతలగా ఆపైన వున్న నీలిసముద్రంలోకి ఎగిరిపోతున్న డేగ. బడిగంట కొట్టగానే ఘొల్లుమంటూ చెదరిపోతున్న పిల్లలు. గుంటగట్టున స్నానంచేసే ఆడవారు, ఎడారి ఇసుకల గీతలు, ఆ గీతలమధ్య ఒక కాలిమువ్వ. ప్రతి అంగుళంలోనూ శిల్ప విన్నాణం శోభి స్తున్న కిటికీ. ఒక ఇంటి ముందున్న మురుగుకాలువ– ఇట్లా ఒకదానినుండి మరొక దానికి పసిపిల్లావాడి మనసులా, పిచ్చికలా ఎగురుకుంటూ వెళ్తుంది కెమెరా .. మధ్య మధ్య ఒక లాంతరు, గొడుగు, పాదరక్షా...వస్తాయి...

ఏవిటి దీని అర్థం ? దీని వెనక కథ ఏమిటి? ఎవరూ ఏమీ చెప్ప లేరు. ఎందుకంటే ఎవరి అనుభవాన్ని బట్టి వారు, ఎవరి సంస్కారాన్ని బట్టి వారు భాష్యం చెప్పుకోవలసినకార్యం ఇది. ఇదంతా ఉత్తచెత్త అని కొట్టి పారెయ్యనూ వచ్చు... మాట లేకుండా ఎదను కదిలించే ఈ చలనచిత్రానికి ప్రాణం-దాని సంగీతం. ఆ సంగీతాన్ని ఇచ్చినది శ్రీ ఏల్చూరి విజయరాఘవ రావు.

నూటికి నూరు పైసలు ఆంధ్రుడైన విజయరాఘరావు గురించి ఆంధ్రులకు తెలియకపోవచ్చు. కాని హిందుస్తానీ సంగీత ప్రియులందరూ ఆయన నేటి హిందూస్థాన్ శైలిలో వేణువు నూదేవారిలో మేటిగా ఎరుగుదురు. నలభై రెండేళ్ళ విజయరాఘవరావు జీవితంలో ఎక్కువ భాగం కవితా- నాటక సంగీతాలకే అంకితమయింది. సయ్యాంకృషితో ఉత్తర హిందూస్తానీ సంగీతకాలలో ప్రథమశేణి వారయిన విజయరాఘవరావు ప్రపంచ ప్రఖ్యాతి నొందిన రవిశంకర్ సంగీతదర్శకత్వం వహించిన ఎన్నో చిత్రాలలో, నాటకాలలో పనిచేశారు. ఢిల్లీ ఆకాశవాణి సంగీతశాఖలో పదేళ్లుండి ప్రస్తుతం పదేళ్ళగా బొంబాయిలోని ఫిలింస్ డివిజన్ సంగీతశాఖకు దర్శకత్వం వహిస్తున్నారు.

కనుకనే హుసేన్ తీసిన చలన చిత్రానికి సంగీతం సమకూర్చమన్నప్పుడు శ్రీవిజయరాఘవరావు మహోత్సాహంతో ఉపక్రమించారు. ఇదివరకు ఎన్నో మనదేశంలో విని ఎరుగని శబ్దసంయోగాలద్వారా సంగీత ధ్వనులను సృష్టించారు. "త్రూది ఐస్ ఆఫ్ ఎ పెయింటర్" చలనచిత్రంలో శ్రీ విజయ రాఘవరావు సంగీతమే లేకపోతే ఏం మిగిలేదో ఊహించడం కష్టం అన్నారు విమర్శకులు. "నా భావాన్ని అర్థం చేసుకున్నారు విజయరాఘవరావు. సరిగ్గా నేనూహించి నట్లుగా అమర్చారు సంగీతం. లేకపోతే నాకొంప మునిగి పోయేది" అన్నారు హుసేన్. కళాకారులిద్దరి హృదయాలమధ్య ఆ సంభాషణ ఆ కళాకారులకే తెలియాలి. దానిని రసహృదయం వున్నవారే వినాలి.

1967 జూలై మొదటివారంలో బెర్లిన్‌లో ముగిసిన 17వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో నిడివి తక్కువయిన చలనచిత్రాలకు ఇవ్వబడే ప్రథమ బహుమతి– "బంగారు ఎలుగుబంటి"... "త్రూది ఐస్ ఆఫ్ ఎ పెయింటర్"కు లభించింది.

భారతీయులందరూ గర్వించదగిన విషయం ఇది. మన హుసేన్, మన విజయరాఘవరావు, మన ఫిలింస్ డివిజన్ కలసి మన దేశానికి తెచ్చిన ఈ మహోన్నత గౌరవానికి మన మందరమూ కృతజ్ఞులుగా ఉండాలి. అందులోను ఏల్చూరి విజయరాఘవరావు ఆంధ్రుడు కావడం మనకు మరింత ఆనందదాయకం. ప్రపంచ ఖ్యాతినందిన ఈ చలన చిత్రానికి "సౌండ్" దర్శకత్వం వహించినవారు మరొక ఆంధ్రులు అనగానే మన గుండెలు మరొక్కసారి ఉప్పొంగుతాయి ఆ "సౌండ్ దర్శకుల పేరు శ్రీ జాస్తి రాఘవేంద్రరావు. వారిది ఏలూరు.

(18 ఆగస్టు 67)